


## ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా సంబరాలు చేసుకున్న కాంగ్రెస్ శ్రేణులు


# ప్రభాత సమాచారం

https: epaper. prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ మంగళవారం । 10 డిసెంబర్ 2024 । ■ 10 పేజీలు


## గుట్టలు మాయం

# ప్రకృతికి గాయం




■ గండి కొడుతున్నా.. గంతలా? ■ జిల్లాలో యథేచ్ఛగా గ్రావెల్ దందా ■ తవ్వకాలను పట్టించుకోని అధికారులు

■ అనుమతులు లేకుండానే గ్రావెల్ తరలింపు ■ మట్టి తరలిపోతున్నా కన్నెత్తి చూడని యంత్రాంగం

■ అధికారం అండతో చెలరేగిపోతున్న మట్టి మాఫియా ■ పగలు, రాత్రుళ్లు తవ్వకాలతో తరిగిపోతోన్న మొరం

■ ముథోల్ నియోజకవర్గంలో రెచ్చిపోతున్న మట్టి మాఫియా ■ చూసీచూడనట్లు వ్యవహారిస్తున్న సంబంధిత శాఖ అధికారులు



ముథోల్, ప్రభాత సమాచారం

మట్టి మాఫియా చెలరేగిపోతోంది. పగలు.. రాత్రిళ్లు అన్న తేడా లేకుండా రెచ్చిపోతోంది. మాఫియా కన్నేసిన కొండలు.. గుట్టలు మాయమవుతున్నా.. అధికారులు కన్నెత్తి చూడటంలేదు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతున్నా అధికారులు అటువైపు చూడటంలేదు. గ్రావెల్ అక్రమార్కులకు కొంత మంది ప్రజాప్రతినిధులు, అధికారుల అండ ఉండటంతో అధికారులు గంతలు కట్టేసుకున్నారా అంటే తవ్వకాలు జరుగుతున్న తీరును బట్టి అర్థం చేసుకోవచ్చు. కొండలను ఎక్స్‌కవేటర్లు కుళ్లబొడుస్తున్నా.. నిత్యం లారీలు, టిప్పర్లు రయ్, రయ్ మంటూ ప్రధాన మార్గాల్లోనూ పరుగులు పెడుతున్నా.. అధికారులకు కనిపించడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ముథోల్ నియోజవకర్గంలోని మచ్కల్, బ్రహ్మం గావ్, రూవ్వి తదితర గ్రామాల్లో నెలల తరబడి మట్టి తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. అరకొర అనుమతులతో భారీగా తవ్వకాలు జరుగుతున్నా.. ప్రజలు ఫిర్యాదు చేస్తున్నా.. మీడియాలో కథనాలు వస్తున్నా.. వాటితో తమకేమీ సంబంధం లేదన్నట్లుగా మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు కళ్లున్నా కబోధుల్లా మారరని ప్రజలు విమర్శిస్తున్నారు. ఒకవేళ తప్పదు అంటే తూతూమంత్రంగా దాడులు.. స్వల్ప జరిమానాలు.. చిన్న కేసులతో అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అడ్డు అదుపు లేకుండా జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలకు అధికారుల అండ పుష్కలంగా ఉండటంతో ఇక వారికి అడ్డ దారే రాచమార్గంగా మారింది. ఏడాదికిపైగా తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటంలేదు. నిబంధనల ప్రకారం తవ్వకాలు చేసుకోవాలంటే.. ఎంత స్థలంలో, ఎన్ని క్యూబిక్ మీటర్లలో తవ్వకాలు చేసుకోవచ్చో ఆ మేరకు మైనింగ్ అధికారులు వే బిల్లులు మంజూరు చేస్తారు. ఆ తర్వాత పంచాయతీల నుంచి కూడా అనుమతులు తీసుకోవాలి. ఆ బిల్లుల ప్రకారమే తవ్వకాలు చేయాలి. అలాంటి అనుమతులు లేకుండా మట్టిని తవ్వి విక్రయిస్తున్నారు. ప్రభుత్వం, పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఆదాయానికి భారీగా గండిపడుతున్నా అధికారులు కన్నెత్తి చూడటంలేదు.

---

### రిమ్స్‌లో డెయిరీ పార్లర్

## ప్రారంభించిన కలెక్టర్



10

రిమ్స్‌కు వచ్చే రోగులు, వారి సహాయకులకు నాణ్యమైన విజయ డెయిరీ పాలు అందించేలా రిమ్స్ ఆవరణలో పార్లర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రజాపాలన తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డెయిరీ పార్లర్‌ను కలెక్టర్ ప్రారంభించారు.

### ట్రాక్టర్‌పై అసెంబ్లీకి వెళ్లిన జిల్లా

## బీజేపీ ఎమ్మెల్యేలు

పాయల్ శకంకర్, పాల్వాయి, రామారావ్ పటేల్

---

### ఆరోగ్యశాఖ కాంట్రాక్ట్

## ఉద్యోగి బలవన్మరణం

■ ఉద్యోగం రెగ్యులర్ కాలేదని మనోవేదన

■ జీవో 510తో నష్టపోయామంటూ సూసైడ్ నోట్

■ ఈ చావుతోనైనా తోటివారికి న్యాయం జరగాలని తనువు చాలించిన భరత్ కుమార్

■ నిర్మల్ జిల్లా కేంద్రంలో విషాద ఘటన

■ నిర్మల్, ప్రభాత సమాచారం

నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన వైద్య, ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగి బకులాభరణం భరత్ కుమార్ సోమవారం సాయంత్రం సొంత ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. ఆత్మహత్యకు ముందు భరత్ రాసిన సూసైడ్ నోట్ తీవ్ర మనో వేదనతో రాసినట్లు ఉంది. ఉద్యోగం రెగ్యులర్ కాలేదని, తనకన్నా హెూదా తక్కువ ఉన్నవారికి ఇదే శాఖలో ఈ జీతం ఎక్కువగా రావ డం... జీతం పెరగకుండా కాంట్రాక్ట్ పద్ధతిలోనే ఉండిపోవడంతో తీవ్రంగా నిరాశ చెందినట్లు పేర్కొన్నారు. ఈ చావుతోనైనా తన తోటివారికి న్యాయం జరగాలని తెలిపారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆరోగ్యశాఖ ఉద్యోగుల్లో భరత్ మృతి తీవ్ర విషాదాన్ని నింపింది.



---

### ఆదిలాబాద్‌లో సైబర్ క్రైమ్

## కార్యాలయం ప్రారంభం

సైబర్ క్రైమ్ బారిన పడితే 1930 నంబర్‌ను సంప్రదించాలి : ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్ ఆలం



ప్రజలు సైబర్ క్రైమ్ బారినపడి ఆర్థికంగా నష్టపోయినట్లయితే వెంటనే 1930టోల్ ఫ్రీ నంబర్‌కు సంప్రదించాలని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. సోమవారం పట్టణంలోని పోలీసు కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన సైబర్ క్రైమ్ కార్యాలయాన్ని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

# చేసిన పనులకు డబ్బులు అడిగితే అరెస్టు చేస్తున్నారు

**జన్నారం, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
గత ఐదు సంవత్సరాలుగా గ్రామపంచాయతీలను అద్దంలా తీర్చిదిద్ది, ఎన్నో వ్యయ ప్రయాసల ఓర్చుకొని ఓర్చుకొని అప్పులు తెచ్చి అభివృద్ధి చేస్తే సర్పంచుల డబ్బులు ఇవ్వకుండా ప్రభుత్వం మీనమేషాలు లెక్కబెడుతుందని జన్నారం మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు జాడి గంగాధర్ అన్నారు. సర్పంచుల రావలసిన పెండింగ్ బిల్లులు కోసం చలో హైదరాబాద్‌కు తరలి వెళ్తున్న సర్పంచ్లను జన్నారం ఎస్సై రాజ వర్ధన్ సోమవారం తెల్లవారుజామునే అరెస్టు చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్ కు తరలించారు. సందర్భంగా సర్పంచుల

## సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు గంగాధర్ సర్పంచులను అరెస్టు చేసిన పోలీసులు

ఫోరం అధ్యక్షుడు గంగాధర్ మాట్లాడుతూ మండలంలోని 29 గ్రామపంచాయతీలో దాదాపు కోటి ఎన్బై లక్షల, 40,వేలు వచ్చేది ఉందన్నారు. బిల్లులు రాక చాలామంది సర్పంచులు అప్పులు తెచ్చి మిథీలు కట్టలేని పరిస్థితులలో కొట్టుమిట్టాడుతున్నారనిఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సర్పంచుల పెండింగ్ బిల్లులో వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని కోరుతున్నాం అన్నారు.





## వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట
# యువకుని అర్ధనగ్న నిరసన

**భైంసా, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా కుబీర్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ముందు మండలానికి చెందిన పార్డి (బి) గ్రామ దళిత యువకుడు శంకర్ పెట్రోల్ బాటిల్ పట్టుకొని, అర్ధనగ్న నిరసన చేపట్టారు. ప్ర ధాన ద్వారం గేటుకు తాళం వేసి, మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దళిత వర్గానికి ఉన్నందున చిన్నచూపుతో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపిస్తూ గేటు బయట బైటాయించారు. వెంటనే పదవిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అక్కడికి చేరుకున్న పోలీసులు యువకుడిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

## సోనియాగాంధీ జన్మదినం..
# వృద్ధులకు స్వెటర్ల పంపిణీ



**బోథ్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
సోనాల మండల కేంద్రం యందు సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా బోథ్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్, గాజుల పోతన్నలు కాంగ్రెస్ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి 100 మంది వృద్ధులకు స్వెటర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ సోనియమ్మ తెలంగాణ ప్రదాత అని, తెలంగాణ ప్రజల కోరిక మేరకు నాడు పార్లమెంటులో బిల్లు పెట్టి తెలంగాణ ప్రజల కోరికను సాకారం చేసిందన్నారు. అదేవిధంగా గాజుల పోతన్న గత కొన్ని సంవత్సరాల నుండి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని వృద్ధులకు స్వెటర్లు పంపిణీ చేయడం చాలా సంతోషం అని రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోనాల పట్టణ అధ్యక్షుడు చెట్లపల్లి అనిల్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ భత్తుల రమేష్, మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి నల్ల అరుణ రెడ్డి, సీనియర్ నాయకులు విజయ్ భాస్కర్ రెడ్డిపాల్గొన్నారు.

# 8 ఏళ్ల బాలికపై లైంగిక దాడి

**నిర్మల్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
ఇటీవల.. లైంగిక దాడుల కేసులు పెరిగిపోతున్నాయి. పోలీసులు, అధికారులు, ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ.. దారుణాలు కొనసాగుతూనే ఉన్నాయి. నిర్మల్ జిల్లా లక్ష్మణచందాలో 8 ఏళ్ల బాలిక తన ఇంటి వద్ద ఆడుకుంటుండగా.. సాగర్(36) అనే వ్యక్తి.. బాలికకు మాయమాటలు చెప్పి ఇంటికి తీసుకెళ్లాడు. బాలికపై లైంగికదాడి చేసి.. అక్కడి నుంచి పంపించాడు. ఆ బాలిక ఏడుస్తూ ఇంటికి వెళ్లి జరిగిన సంఘటన గురించి తల్లికి చెప్పింది. తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

# పాఠశాలలో బోర్ వేయించిన మార్కెట్ చైర్మన్



**సారంగాపూర్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
మండలంలోని స్వర్ణ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం సోమవారం సోనియా గాంధీ పుట్టిన రోజు పురస్కరించుకొని మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హది స్వంత ఖర్చుతో బోర్ వెల్ వేయించి విద్యార్థులకు నీటి సౌకర్యం కల్పించారు. పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు చైర్మన్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు కిషన్ సెల్ వర్కింగ్ ప్రసిడెంట్ పోతారెడ్డి, మార్కెట్ డైరెక్టర్ కొత్తకాపు పోత రెడ్డి, నాయకులు సాక్ పెల్లి సురేందర్, బట్టు భోజన్న, రాజ్ కుమార్, మోబిన్, పర్వాన్న, ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాలు విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్య కాంట్రాక్ట్ ఉద్యోగి ఆత్మహత్య...
# సూసైడ్‌నోట్ రాసి తనువు చాలించిన భరత్

**నిర్మల్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగి బకులాభరణం భరత్ కుమార్ సోమవారం సాయంత్రం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. ఆత్మహత్యకు ముందు భరత్ రాసిన సూసైడ్ నోట్ తీవ్ర మనోవేదనతో రాసినట్లు ఉంది. ఆ లేఖ సారాంశం మేరకు... మా అమ్మానాన్నల కడుపులో పుట్టడం నా అదృష్టం. ఎంతో పెద్ద ఉద్యోగం వస్తుందని కలలు కన్నాను. 2018లో డీఎస్సీ ద్వారా నియామకం పొంది ఆరోగ్యశాఖలో ఆర్ఎన్టీసీపీ విభాగంలో సీనియర్ ట్రీట్మెంట్ ల్యాబ్ టెక్నీషియన్‌గా ఉద్యోగం పొందాను. జీవితంలో స్థిరపడతానని ఆశించాను. కానీ నాకన్నా హోదా తక్కువ ఉన్నవారికి ఇదే శాఖలో ఈ జీతం ఎక్కువగా రావడం... నా జీతం మాత్రం పెరగకుండా కాంట్రాక్ట్ పద్ధతిలోనే ఉండిపోవడంతో తీవ్రంగా నిరాశ చెందాను. నాతో పాటు తన లాంటి వాళ్లను రెగ్యులర్ చేసే విషయంలో జీవో 510 అన్యాయం చేసింది. అప్పటి ప్రభుత్వంలో వచ్చిన ఈ జీవో వల్ల తాము నష్టపోయాం. ఇటీవల జీవో 16 కూడా అమలు చేయవద్దని ఉత్తర్వులు వచ్చాయి. దీంతో తాము తీరని అన్యాయానికి గురయ్యాము. ఉద్యోగం రెగ్యులర్ అవుతుందని ఎంతో ఆశతో ఎదురు చూశాను కానీ అది జరగక పోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాను. నా భార్య పల్లవి కి అన్యాయం చేస్తున్నాను. కొడుకు దేవా ను విడిపోతున్నాను. మీ ఇద్దరినీ బాగా చూసుకుంటానని కలలు కన్నాను. కానీ ఉద్యోగం రెగ్యులర్ కాకపోవడంతో మీకు చెప్పినట్లుగా ముందుకు వెళ్లలేకపోయాను. ఇంత కాలం పనిచేసిన కాలంలో నాకు రావలసిన పిఎల్ బకాయిలు వస్తే నా భార్యకు ఇవ్వండి అంటూ తన సహచర ఉద్యోగులు సంఘం నాయకులను ఆ లేఖలో కోరారు. నా ఆత్మహత్యతో అయినా మిగతా వారికి న్యాయం జరగాలి ఈ విషయాన్ని రాష్ట్ర స్థాయిలో తెలిసేలా చూడండి అంటూ సంఘం అధ్యక్షుడికి విజ్ఞప్తి చేశారు. అమ్మా నాన్న సారీ అంటూనే ఇంతకాలం తాను పనిచేసిన కాలంలో సహచర ఉద్యోగులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు అందరికీ రుణపడి ఉంటాను అంటూ సూసైడ్ నోట్ రాశారు. భరత్ మృతి ఆరోగ్య శాఖ ఉద్యోగుల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. కాగా భరత్ కు భార్య, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. నిర్మల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు



**జన్నారం, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
రాజ్యసభ సభ్యురాలు, ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు, సోనియా గాంధీ జన్మదిన వేడుకలను సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చి తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన మహా నాయకురాలు సోనియమ్మ అన్నారు. ఆసుపత్రిలో పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం,రాజశేఖర్, మత్స్య శంకరయ్య, ఇసాక్ ముత్యం సతీష్, సుధాకర్ నాయక్, లక్ష్మీనారాయణ నందు నాయక్ మహమ్మద్ అజారుద్దీన్ కుమారస్వామి, రాజన్న షాకీర్, కంటెం శంకర్, నందు నాయక్, మౌలానా, ప్రదీప్, తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## క్రీడారంగ అభివృద్ధిపై
# ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
## అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్

**మంచిర్యాల, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
క్రీడా రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని, ఇందులో భాగంగా సి.ఎం. కప్-2024 పోటీలను నిర్వహించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. సి.ఎం. కప్ పోటీలలో భాగంగా ఈ నెల 7, 8 తేదీలలో గ్రామపంచాయతీ స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించి ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను గుర్తించి ఈ నెల 10 నుండి 12వ తేదీ వరకు జరుగనున్న మండల, మున్సిపాలిటీల స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరిగిందని, ఈ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులను ఈ నెల 16 నుండి 21వ తేదీ వరకు జరుగనున్న జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. రాజస్వ మండల అధికారులు ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, తహశిల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల విద్యాధికారులు, పాఠశాలల క్రీడా కార్యదర్శులు, పి.ఈ.టి.లు/ పి.డి.లు, సీనియర్ క్రీడాకారులతో ఏర్పాటు చేసిన మండల స్థాయి కమిటీ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని, అధికారులు సమన్వయంతో కృషి చేసి క్రీడాపోటీలు సమర్థవంతంగా జరిగేలా కృషి చేయాలని తెలిపారు.

# సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

**సారంగాపూర్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ 78వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేట్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హది మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల స్వరాష్ట్రం 60 ఏళ్ల ఆకాంక్షను నెరవేర్చిన త్యాగ శీలి తెలంగాణ ప్రదాత సోనియాగాంధీని ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ పోతారెడ్డి, మాజీ అడెల్లి ఛైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి,మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు విలాస్, నాయకులు పవర్ రాజేష్, సత్యపాల్ రెడ్డి,రాజ్ కుమార్,పోతన్న, హైమద్, లక్ష్మన్, సురేందర్, రాజేశ్వర్, డైరెక్టర్లు భోజన్న, పొత్తరెడ్డి, నాగోరవ్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.







# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

## మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్

**మంచిర్యాల, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)** ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో బెల్లంపల్లి రాజస్వ మండల అధికారి హరికృష్ణతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన కందె శ్రీలత తాను పోలియో వలన పూర్తిగా నడవలేనని, డిగ్రీ పూర్తి చేశానని, తనకు ఎలక్ట్రిక్ వీల్ చైర్ ఇప్పించి పూజా సామాగ్రి విక్రయించే షాప్ ఏర్పాటు కొరకు రుణ సహాయం అందించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మందమర్రి మండలం సారంగపల్లి గ్రామస్తులు తమ గ్రామంలో దాదాపు 50 కుటుంబాలు 45 సంవత్సరాలుగా ఇండ్లు నిర్మించుకొని ఉంటున్నామని, ఈ ఇండ్లకు సర్వే నిర్వహించి పట్టాలు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మందమర్రి పట్టణానికి చెందిన గరిగే సుమన్ మందమర్రి ఊర చెరువు పనుల నిర్వహణలో జాప్యం జరుగుతోందని, పనులు వేగవంతం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కన్నెపల్లి మండలం జజ్జరవెల్లి గ్రామానికి చెందిన కొట్రంగి చిన్నన్న అలియాస్ శ్రీను తనకు దాంపూర్ శివారులో ఉన్న భూమికి సంబంధించి ధరణి రికార్డులలో తప్పుగా నమోదైన తన పేరు మార్చుకొనుటకు అవకాశం కల్పించి తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం తాళ్లగురిజాల గ్రామానికి చెందిన వంగ శ్రీనివాస్ గౌడ్ తాను గతంలో దివ్యాంగ పింఛన్ పొందానని, సదరం శిబిరంలో రెన్యువల్ కొరకు పరీక్షకు హాజరైనప్పటి నుండి పింఛన్ రావడం లేదని, ఈ విషయమై విచారించి తనకు పింఛన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జైపూర్ మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన గాడిపెల్లి సుధాకర్ మండలంలోని ఇందారం ఓపెన్కాస్ట్లో ముంపుకు గురి అయిన తన భూమికి సంబంధించి నష్టపరిహారం ఇప్పించాలని అర్జీ సమర్పించారు. కాజీపేట మండలానికి చెందిన ఎస్.కె. కరీం తనకు గ్రామ శివారులో గల భూమి సింగరేణి కె.కె. ఓపెన్కాస్ట్ తీసుకోవడం జరిగిందని, ఇట్టి భూమిలో ఉన్న 60 మీటర్ల పైప్ లైన్, కెనాలు పరిహారం చెల్లించలేదని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జన్నారం మండలం రోటిగూడెం గ్రామానికి చెందిన నీరటి సత్తయ్య తనకు గ్రామ శివారులో భూమి ఉందని, ఇట్టి భూమిని ఆన్లైన్లో నమోదు చేసి నూతన ధరణి పాస్ పుస్తకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నస్పూర్ మండల కేంద్రానికి చెందిన మామిడి పోచమ్మ తాను నిరుపేద వృద్ధురాలను అని, అద్దె ఇంటిలో నివసిస్తున్నానని, తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జైపూర్ మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన జుమ్మిడి లక్ష్మి తనకు ఇందారం శివారులో ఉన్న భూమి జాతీయ రహదారి నిర్మాణంలో పోయిందని, సర్వే సమయంలో తన భూమిలో బావి, బోరు, పైప్ లైన్లు, టేకు చెట్లు ఉన్నాయని, ఇవి నమోదు చేయలేదని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్సలు

**జన్నారం, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)** మండలంలోని రోటీగూడ గ్రామ పంచాయతీలో సోమవారం పశుగణాభి సంస్థ ఆదిలాబాద్, పశు సంవర్ధక శాఖ మంచిర్యాల ఆధ్వర్యంలో పశువులకు గర్భ కోశ వ్యాధి నివారణ చికిత్సలు, చూడి పరీక్షలు, నిర్వహించి ఉచితంగ మందులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ , సిబ్బంది, సంజీవ్, గోపాల మిత్ర సూపర్ వైజర్ మంచిర్యాల రవి, రోటీగూడ కేంద్రం గోపాల మిత్ర సిలివేరి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.



# సోనియా గాంధీ జన్మదిన వేడుకలు



**జన్నారం, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)** జన్నారం మండల కేంద్రంలో ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముజఫర్ అలీ ఖాన్, ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మిక్కినేని రాజశేఖర్, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# జీఎంను కలిసిన గెజిటెడ్ అధికారులు

**శ్రీరాంపూర్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)** జిల్లాలో నూతనంగా ఏర్పడిన తెలంగాణ గెజిటెడ్ అధికారులు అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ జి.ఎం. ఎల్.వి. సూర్య నారాయణను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వనజారెడ్డి, సుధాకర్, కోశాధికారి రాకేష్ పాల్గొన్నారు.



# తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

**జన్నారం, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)** జన్నారం మండల కేంద్రంలో సోమవారం రోజున బి ఆర్ ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ పర్యటించారు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు మూడు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జన్నారం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజారాం రెడ్డి, సుల్వ జనార్ధన్, నాయకులు ఫజల్ ఖాన్, భరత్, శ్రీనివాస్ గౌడ్, యూసుఫ్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర సాధనలో సుష్మా స్వరాజ్ పాత్ర కీలకం : ఎమ్మెల్యే రామారావు పటేల్



**భైంసా, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)** తెలంగాణ రాష్ట్ర సాధనలో సుష్మా స్వరాజ్ పాత్ర కీలకమని, గుర్తు చేయక విస్మరించడం తగదని ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అన్నారు.సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా అసెంబ్లీలో మాట్లాడారు.మాజీ ఎమ్మెల్యేలకు నిధులు ఇవ్వడం అంటే ప్రోటోకాల్ను విస్మరించడ మేనని అదిలాబాద్ జిల్లా అధ్యక్షురాలు సీతక్కకు మంత్రులకు సూచించారు. నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష తెలంగాణ రాష్ట్ర సాధనలో అప్పటి బిజెపి ప్రతిపక్ష నాయకురాలు సుస్మా స్వరాజ్ పాత్ర అమోఘమని,ప్రస్తుతం విస్మరించడమేంటని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఎందరో అమరుల త్యాగమని ప్రతి పక్ష నాయకురాలు తీర్మానానికి మద్దతు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.గత ప్రభుత్వ తప్పిదాల వల్లే తెలంగాణ ప్రగతి ఆగిపోయిందని, మళ్లీ అలాంటి తప్పిదాలు చేయొద్దని ప్రభుత్వానికి సూచించారు.ప్రోటో కాల్ పాటించి ప్రజా తీర్పును గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, మాజీ ఎమ్మెల్యేలకు నిధులు ఇస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. తెలంగాణ తల్లి రూపకర్తకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో కృష్ణవేణి విద్యార్థుల ప్రతిభ

**బెల్లంపల్లి, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)** ఈనెల 4వ రాష్ట్రస్థాయి ఓపెన్ టు ఆల్ స్టైల్ కరాటే ఛాంపియన్షిప్ 2024 మంచిర్యాల జిల్లా లక్షట్ పేట్ లోని గురునానక్ గార్డెన్ వేదికగా డ్రాగన్ స్వీర్డ్ ఆధ్వర్యంలో కరాటే పోటీలు నిర్వహించారు.ఈ పోటీల్లో బెల్లంపల్లి కృష్ణవేణి టాలెంట్ స్కూల్ 11మంది విద్యార్థులు 2 గోల్డ్ మెడల్స్,7సిల్వర్ మెడల్స్,2 బ్రాంజ్ మెడల్స్ ను సాధించారని పాఠశాల డైరెక్టర్ ఈ రవిప్రసాద్,ప్రిన్సిపల్ యం రాజారమేష్ లు తెలిపారు.పోటీల్లో మెడల్స్ సాధించిన వారిలో యం అలోక్ (గోల్డ్),పి పునీత్ గగన్ (బ్రాంజ్ మెడల్),యం హర్షిత్(సిల్వర్ మెడల్),జి రిత్విక్(బ్రాంజ్ మెడల్),డి వశీకరణ్ (సిల్వర్ మెడల్),వి వైష్ణశ్రీ(సిల్వర్ మెడల్),యం సుష్మశ్రీ (సిల్వర్ మెడల్),కె ప్రశంస (సిల్వర్ మెడల్),కె ప్రణతి(గోల్డ్ మెడల్),ఇ సహస్(సిల్వర్ మెడల్), శ్రీనివాస్ (సిల్వర్ మెడల్)లు ఉన్నారు.మెడల్స్ సాధించిన క్రీడాకారులను పాఠశాల డైరెక్టర్,ప్రిన్సిపల్ లు మాట్లాడుతు కరాటే విద్యార్థుల ఆత్మరక్షణ కొరకు ఉపయోగపడుతుందని,శక్తివంతమైన ఆరోగ్యాన్ని సంపాదించుకోవచ్చు అని అన్నారు. పాఠశాలకు 11మెడల్స్ రావడం చాలా గర్వకారణం అని అన్నారు.ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ ప్రవంతి,వ్యాయామ ఉపాధ్యాయులు మల్లేష్ యాదవ్, సంతోష్ యాదవ్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.





## అర్జీలు స్వీకరించిన ఆదిలాబాద్ అదనపు కలెక్టర్..

**ఆదిలాబాద్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
ప్రజావాణిలో ప్రజలు అందించే అర్జీల్లో సహేతుకమైన వాటి పరిష్కారంలో జాప్యం జరగకుండా చూసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలదేవి అన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ప్రజల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. అర్జీదారులు చెప్పే సమస్యలను విన్న ఆమె వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. భూ వివాదాలు, ఉద్యోగాల కల్పన కోసం ప్రజావాణీలో అర్జీలు పెట్టుకోవద్దన్నారు. సమస్య పరిష్కారం కోసం కొంతకాలం వేచి ఉండాలని, అదే సమస్యపై పదే పదే అర్జీలు ఇవ్వడం సరికాదన్నారు. పరిష్కార సాధ్యమయ్యే వాటిని పెండింగ్ లో పెట్టడం సరికాదని, అలా చేయడం వల్ల ప్రజా విశ్వాసాన్ని కోల్పోవాల్సి వస్తుందని అధికారులకు సూచించారు. కాగా ప్రజావాణిలో సోమవారం మొత్తం 78 వరకు వివిధ సమస్యలపై అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో వినోద్ కుమార్, జడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలి



**ఆసిఫాబాద్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ రావుకు బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థులను, యువతను ఆసరా చేస్తూ కొంత మంది వ్యక్తులు విచ్చలవిడిగా గంజాయి, మట్కా (సట్టా) బెల్ట్ షాపులు, నడుపుతూ యువతను మత్తులో ఉంచుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఈ ఆరాచకాలకు పాల్పడుతున్న స్మగ్లర్లపై చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్ , సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్ కుమార్, గేదం టీకానంద్, సిపిఎం పార్టీ జిల్లా నాయకులు చాపిడి శ్రావణి, దుర్గం నిఖిల్ గొడిసెల కార్తీక్, తదితరులు పాల్గొన్నారు,

## పర్యావరణ పరిరక్షణపైన అవగాహన




**సోన్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
మండలంలోని కూచన్‌పెల్లి గ్రామంలో పర్యావరణ పరిరక్షణపైన అవగాహన సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డ్రీమ్ సంస్థ కో-ఆర్డినేటర్ చిన్నయ్య మాట్లాడుతూ వరి కొయ్యలను కాలిస్తే పర్యావరణం కలుషితమైతుందన్నారు. గ్రామ అభివృద్ధి సభ్యులు పాల్గొన్నారు.

## బీసీ వసతి గృహానికి పక్క భవనాన్ని ఏర్పాటు చేయాలి




### ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నీరటి రామ్ ప్రసాద్

**మంచిర్యాల, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బిసి వసతి గృహానికి స్వంత భవనాన్ని వెంటనే కేటాయించాలని సోమవారం నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్ ప్రసాద్ డిమాండ్ చేశారు. పక్క భవన నిర్మాణానికి ఆ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సంధర్భంగా రామ్ ప్రసాద్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుండి బిసి వసతి గృహానికి స్వంత భవనం లేక విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా అద్దె భవనం కాలేజీల నుండి దూరంలో ఉండటం వల్ల విద్యార్థులు ప్రతి రోజు కాలేజీలకు వెళ్లివచ్చే సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే విద్యార్థుల సమస్యలు తీరే విధంగా అందరికి అనుకూలంగా వుండే ప్రాంతంలో బిసి వసతి గృహానికి స్వంత భవనం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ ఈరోజు అద్దె భవనంలో వసతి గృహాన్ని నిర్వహించడం వల్ల ఎలాంటి గ్రీజర్లు, సరైన వసతులు లేక కూడా చాలా మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నా కూడా హాస్టళ్లలో ఉండటానికి ఆసక్తి లేక ఇండ్లకు తిరిగి వెళ్తున్నారని తెలిపారు. చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ వెంటనే చెప్పట్టాలని, లేని పక్షంలో ఎన్.ఎస్.ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆమోఘ్, ఆశిష్, మహేష్, సాయిరాం, తిరుపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు..



**ఆసిఫాబాద్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
సోనియా గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. సోమవారం జిల్లా కేంద్రంలో స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాసాదే చరణ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండా శ్యామ్, ఎన్ఎస్యుఐ జిల్లా అధ్యక్షుడు ఎండి ఆసిఫ్ అలీ, మాజీ ఎంపీపీ బొమ్మెన బాలేష్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గాదివేని మల్లేష్, ఎన్ ఎస్ ఐ అసెంబ్లీ ప్రెసిడెంట్ జమీర్ అహ్మద్, ఆసిఫాబాద్ టౌన్ ప్రెసిడెంట్ మహమ్మద్ అబ్దుల్ రఫీక్ పాల్గొన్నారు.

# 55వ వార్షిక రక్షణ వారోత్సవాలు



**శ్రీరాంపూర్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
సింగరేణి వ్యాప్తంగా ఉద్యోగుల రక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రతి సంవత్సరం వార్షిక రక్షణ పక్షోత్సవాలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ లోతు వెంకట సూర్యనారాయణ అన్నారు. సోమవారం ఏరియాలోని సిహెచ్పిలో వార్షిక రక్షణ వారోత్సవాల కార్యక్రమాన్ని ఆయనతో పాటు ఇన్స్పెక్షన్ కమిటీ కన్వీనర్, కార్పొరేట్ జిఎం ఎలీషా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నేడు రక్షణ వారోత్సవాలలో మీ అందరితో పాటుగా పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. అలాగే ఉద్యోగులందర సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్స్‌పై అవగాహన కలిగి, పనులలో వ్యక్తిగత రక్షణ పరికరాలను ధరిస్తూ తమ యొక్క రక్షణతో పాటు ఇతరుల రక్షణను కూడా ఎల్లవేళలా చూస్తూ ఉండాలని సూచించారు. సంస్థ 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు వెళుతుందని, దానిని సాధించే క్రమంలో రక్షణ ఎవరూ మరువకూడదని సూచించారు.అన్ని విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగుల పని విధానాన్ని ప్రత్యక్షంగా తనిఖీ చేసి, వారు తీసుకుంటున్న జాగ్రత్త చర్యలను గమనిస్తామని తెలిపారు. ప్రతిరోజు రక్షణతో పని చేయాలని సంస్థ పురోగతిలో భాగస్వాములు కావాలని కోరారు.

రక్షణ పక్షోత్సవాల ఇన్స్పెక్షన్ కమిటీ వారు కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ సేఫ్టీ కమిటీ వారితో కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ లో జరిగిన పూర్వపు ప్రమాదాలు, అటువంటి ప్రమాదాలు మళ్లీ జరగకుండా ఉండడానికి తీసుకోవాల్సిన రక్షణ చర్యల గురించి కూలంకషంగా చర్చించారు. అనంతరం ప్లాంట్ లో తీసుకుంటున్న రక్షణ చర్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జిఎం ఎన్ సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఏరియా రక్షణాధికారి శ్రీధర్ రావు, చంద్రలింగం, ఇన్స్పెక్షన్ కమిటీ సభ్యులు గాబ్రియల్ రాజు, డాక్టర్ పద్మ,మహేంద్రనాథ్,హనుమాన్ గౌడ్, వెంకటేశ్వర్లు, టి సతీష్ కుమార్,జి శ్రీనివాస్, తిరుపతి, రక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

**జైనూర్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
పార్టీ కోసం పదవులను తృణ ప్రాయంగా త్యజించిన త్యాగమూర్తి సోనియా గాంధీ అని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ సుగుణ అన్నారు. సోమవారం జైనూర్ మార్కెట్ శాఖ కార్యాలయంలో జరిగిన యూపీఏ చైర్ పర్సన్ సోనియా గాంధీ 78వ జన్మదిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. పెద్ద ఎత్తున హాజరైన కాంగ్రెస్ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకొని తమ అభిమాన నాయకురాలి పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ తెలంగాణ ప్రజల సెంటిమెంట్ గమనించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన దేవత సోనియా గాంధీ అని కొనియాడారు. ఏడాది కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల్లో మంచి స్పందన ఉందని, మెజారిటీ ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్, వైస్ చైర్మన్ బాణోత్ జైవంత్, పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ముఖీద్ అహేమద్, మాజీ వైస్ ఎంపిపి షేక్ రషీద్, మాజీ కో-అప్షన్ ఆఫ్రోజ్, నాయకులు అహేమద్ ఖాన్, సయ్యద్ వాసీమ్,షేక్ ఇస్లాం పాల్గొన్నారు.



### సోనియమ్మకు జన్మదినం.. సమగ్ర శిక్షకి శిక్షా దినం..

## ఉద్యోగుల వినూత్న నిరసన



**ఆదిలాబాద్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
సీఎం రేవంత్ రెడ్డి సోనియా జన్మదినం సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలంటూ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం సమగ్ర శిక్ష ఉద్యోగులు వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్షా ఉద్యోగుల రాష్ట్ర అధికార ప్రతినిధి రవీందర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హనుమకొండ, ఏకశిలా పార్క్ వద్ద టీఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు రెగ్యులర్ చేయాలని, తక్షణమే పే స్కేల్స్ అమలు చేయడం, ఉద్యోగ,జీవన, జీవిత, ఆరోగ్య,ఆర్థిక భద్రత కల్పించాలని కోరారు. సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం, మంత్రులు,తమ గ్యారంటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు కేశవ్,ప్రకాష్, దేవదర్శన్నా, వెంకటి,శ్రీకాంత్, సురేందర్ తదితరులు ఉన్నారు.



## ఐటిడిఏ కంట్రోల్ రూమ్ సిబ్బంది
# సమయ పాలన పాటించాలి

**ఉట్నూర్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
రిమ్స్ ఆదిలాబాద్‌లోని ఐటిడిఏ కంట్రోల్ రూమ్ సిబ్బంది కచ్చితంగా 24 గంటలు సమయపాలన పాటించాలని ప్రాజెక్టు అధికారి కూసుబు గుప్తా ఆదేశించారు. ఉదయం రాత్రి అటెండెన్స్ నమోదు చేయాలని ఆదివాసీ గిరిజనులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్యం సేవలు అందించాలని అన్నారు. విధుల సమయంలో ఆబ్సెంట్ కనక ఉంటే వారి డిప్యుటేషన్ రద్దు చేయడం జరుగుతుంది. అంబులెన్సు ఎప్పటికి ఉపయోగంలో ఉండే విధంగా అందుబాటులో ఉండాలని తెలిపారు.అదేవిధంగా మీ సిబంది యొక్క వాట్సాప్ గ్రూప్ తయారు చేయాలి అని అన్నారు. కంట్రోల్ రూమ్స్‌లో పరిశుభ్రత పాటించాలి అలాగే మరమ్మతులు కానీ అంబులెన్సు రేపైర్స్ ఉంటే తమ దృష్టిలో తీసుకోరావాలని సూచించారు. అనంతరం అంగన్వాడీ చిన్నారులకు కొత్త యూనిఫామ్ లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు వైద్యశాఖ అధికారి మనోహర్, సిడిపిఒ ఉమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ
# నిర్మాణానికి శంకుస్థాపన



**బెల్లంపల్లి, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
కన్నెపల్లి మండలంలోని జజ్జరవెల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి, దాంపూర్, జజ్జరవెల్లి గ్రామాల్లో మంజూరైన ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీ గోడ, సిసి రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై కొబ్బరికాయ కొట్టి పనులను సోమవారం బెల్లంపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాధవరపు నర్సింగరావు ప్రారంభించారు.

# సోనియా గాంధీ జన్మదిన వేడుకలు



**భైంసా, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
అగ్రనేత సోనియా గాంధీ పుట్టినరోజు వేడుకలు నారాయణరావు పటేల్ ఆధ్వర్యంలో సోమవారం భైంసా జిన్నింగ్ ఫ్యాక్టరీలో ఘనంగా నిర్వహించారు. అనంతరం సోనియాగాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 108 అంబులెన్స్‌లో ప్రసవం

**కుభీర్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
రంజిని తాండకు చెందిన దేవిక బాయి అనే మహిళ సోమవారం పురిటి నొప్పులతో బాధపడుతున్న తరుణంలో 108కు సమాచారం అందించగా సిబ్బంది గ్రామానికి చేరుకుంది. పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళను ఆసుపత్రికి తీసుకెళ్తుండగా నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్‌లోనే ప్రసవం చేయడం జరిగింది. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నట్లు తెలిపారు.

# సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలి

## ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా

**ఉట్నూర్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ ఛాంబర్లో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను ఆమె స్వీకరించారు. గాదిగూడ మండలం శివన్నారా గ్రామానికి చెందిన రాజు తమ గ్రామానికి అంగన్వాడీ సెంటర్, సిసి రోడ్డు మంజూరు చేయించామని, బేలా మండలం గణేష్ పూర్ గ్రామానికి చెందిన మాడవి లస్మా గ్ర తనకి ఏడ్ల జత కలిపించాలని,సిర్పూర్ యు మండలం మెట్టిగూడ గ్రామానికి చెందిన పెందోర్ భువనేశ్వరి తనకి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించామని ,భీమని మండలం కర్జిభీంపూర్ గ్రామానికి చెందిన టెకం పోషన్న తనకు బోర్ వెల్ మంజూరు చేయించామని కోరారు.పింఛన్, రెండుపడక గదుల ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబందించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జనరల్ వసంతరావు,ఏపీవో పివిటిజి మెస్రం మనోహర్ ఐసిడిఎస్సి ఉమాదేవి,డిపిఓ ప్రవీణ్, మేనేజర్ లింగు తదితర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రతి విద్యార్థి ఒక ప్రణాళిక బద్ధంగా చదవాలి

**జన్నారం, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
జన్నారం మండలంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాల నందు సోమవారం తల్లిదండ్రుల, సంరక్షకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలలో ప్రతి అధ్యాపకుడు 90 రోజుల కార్య ప్రణాళికను రూపొందించారని, తల్లిదండ్రులు కచ్చితంగా తమ పిల్లలను ఈ ప్రణాళిక ను అనుసరించి తమ పిల్లలు మంచి మార్కులు సాధించేలా కృషి చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. తమ పిల్లలను మొబైల్ ఫోన్స్ కు దూరంగా ఉంచాలని మరియు వారి ఆహారపు, ఆరోగ్య అలవాట్లతో పాటు ప్రణాళిక ప్రకారం చదివి తమ గమ్యాన్ని చేరుకొనే విధంగా కృషి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు.మనం చేసే ఈ చిన్న చిన్న ప్రయత్నాలు విద్యార్థులను విజయతీరాలకు చేరవేస్తుందని, చిన్న చిన్న నీటి బొట్లు కలిస్తేనే పెద్ద మహాసముద్రం అవుతుందని కళాశాల ఎన్.ఎస్.ఎస్. పి.ఓ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి శ్రీనివాస్, అధ్యాపకులు రవీందర్, బాపురావు, సాయికుమార్, నాగేశ్వరరావు, శశికళ, దేవేందర్, కుమారస్వామి, స్వరూప, రేఖ, అనూష, మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# గణిత పరీక్షకు ఎంపికైన విద్యార్థులు



**జన్నారం, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
సోమవారం మండల విద్యాధికారి ఎన్ విజయకుమార్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన మండల స్థాయి గణిత ప్రతిభ పాటవ పరీక్షలలో ఇంగ్లీష్ మీడియం విభాగంలో ప్రథమ శ్రేణి ఏ.అన్వేష్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కిష్టాపూర్, ద్వితీయ శ్రేణులలో అశ్వక్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కలమడుగు, ఏ అన్వేష్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కిష్టాపూర్, తృతీయ శ్రేణి బి నిశిన్ కుమార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కలమడుగు, తెలుగు మీడియం విభాగంలో ప్రథమ శ్రేణి బి.విజయలక్ష్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాదం పెల్లి, ద్వితీయ శ్రేణి టి.విజయలక్ష్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాదం పెల్లి, తృతీయ శ్రేణి జె.శ్రీవాణి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాదం పెల్లి, ప్రథమ ద్వితీయ తృతీయ శ్రేణులలో ఉత్తీర్ణులైనారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు మండల విద్యాధికారి ఎన్ విజయకుమార్ బహుమతులు అందజేశారు.ఈ విద్యార్థులు ఈనెల 11వ తేదీ బుధవారం మంచిర్యాలలో జరిగే జిల్లా స్థాయి పోటీ పరీక్షలలో పాల్గొంటారు అని మండల విద్యాధికారి ఎన్ విజయకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎన్ విజయకుమార్, ఇంధన్ పల్లి కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు బి రాజేందర్, తపాలాపూర్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు ఎల్ మురళీధర్, టి ఎమ్ ఎఫ్ జన్నారం మండల అధ్యక్షులు సదానందం, ప్రధాన కార్యదర్శి ఎం.తిరుపతి, సీనియర్ ఉపాధ్యాయులు విజయకాంత్, విద్యాసాగర్, రాజన్న, గోవర్ధన్, అంజన్న, కమల, కిషన్ రావు, రమాదేవి, జన్నారం మండల గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పశుగర్భ కోశ చికిత్సపై అవగాహన



**ముథోల్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
ముథోల్ మండలం లోని రాంటెక్ గ్రామంలో పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృది సంస్థ ఆద్వర్యంలో ఉచిత పశుగర్భకోశ చికిత్స శిబిరం పై అవగావాన శిబిరం నిర్వహించడం జరిగింది. సోమవారం రోజు శిబిరంలో ముఖ్య అతిధిగా పశుగణాభివృద్ధి సంస్థ ఉమ్మడి ఆదిలాబాద్ అధికారి రామరావు కృత్రిమ గర్భదారణ వలన కలిగే లాభాలు ,దేశవాళీ పశువులకు మేలురకం వీర్య దానం, మేలు జాతి దూడలు పుట్టి పాల దిగుబడి పెరిగి రైతుల ఆర్థికంగా లాభం పోందుతారని చెప్పారు.ఈ కార్యక్రమంలో డా.రామారావు, డా.సురేష్, సహాయ సంచాలకులు డా. రవీందర్,మండల పశు వైద్య అధికారిని డా. సౌదర్య, గోపాల మిత్ర సూపర్ వైజర్ గోపాల్, విజయ డైరి మెనేజర్ వెంకట సామి, గ్రామస్థులు లావణ్య, సంజీవ్, గోపాల మిత్రులు రమేష్, మదన్ మల్లేష్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ పథకంలో పంచాయతీ
# కార్యదర్శులను మినయించాలి

**ముథోల్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
ఇందిరమ్మ ఇండ్ల సర్వే నుంచి పంచాయతీ కార్యదర్శులను మినయించాలని ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో తమ సమస్యలను వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రస్తుతము పంచాయతీ కార్యదర్శులు సమాచార సేకరణ తో పాటు పలు ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ, ఆన్లైన్, సర్వేలు డిజిటల్ కార్డులు కులగ, ఆర్థిక సర్వే, ఎస్ఆర్ఎస్ తదితర కార్యకలాపాలు చేపడుతున్నారు. ఇట్టి సర్వేలను క్షేత్రస్థాయిలో ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తూ విజయవంతం చేస్తున్నప్పటికీ తమ గోడు ప్రభుత్వము పట్టించుకోవడంలేదని మానసిక ఆందోళన వ్యక్తం చేశారు . కార్యదర్శులతో పంచాయతీ రాజ్ శాఖకు సంబంధం లేని పలు రకాల పనులు, సర్వేలు చేస్తున్నప్పటికీ తమ సమస్యలు పట్టించుకోవడంలేదని



ఆవేదన చేశారు. మా ద్వారా నాణ్యమైన వివరాలు, సమాచారం అందుతున్నప్పటికీ మా సమస్యలు పరిష్కరించుటకు ప్రభుత్వం ఏ విధమైన చర్చలకు అవకాశం కల్పించకపోవడం శోచనీయం అని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో మా సమస్యల పరిష్కారానికి ఒక స్పష్టమైన కార్యచరణ ప్రకటన విడుదల చేసి దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతు న్నాము. పంచాయతీ కార్యదర్శులకు భారం బాధ్యతలు పెరుగుతున్నాయి, ఇందిరమ్మ సర్వే నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ముథోల్ మండల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



## ఆదిలాబాద్‌లో ఘనంగా
## సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

**ఆదిలాబాద్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ జన్మదిన వేడుకలు ఆ పార్టీ నాయకులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ప్రజాసేవాభవన్ లో ఏర్పాటు చేసిన సోనియాగాంధీ జన్మదిన వేడుకలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ దిగంబర్రావ్ పాటిల్లు కేక్ కట్ చేశారు. అనంతరం ఒకరి నొకరు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. సోనియా గాంధీ వల్లే తెలంగాణ రాష్ట్రం సాకారమైందని, సమైక్యవాదుల నుంచి ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఇచ్చిన మాటకు కట్టుబడ్డ గొప్ప నాయకురాలు సోనియమ్మ అని మాజీ మున్సిపల్ చైర్మన్ దిగంబర్ రావ్ పాటిల్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పార్టీకి నష్టం జరుగుతుందని తెలిసినా.. తెలంగాణ విద్యార్థుల ఆత్మ బలిదానాలకు చలించి ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను సాకారం చేశారన్నారు. దేశ హితం కోసం పనిచేసి ప్రాణత్యాగాలు చేసిన గొప్ప కుటుంబమన్నారు. సోనియా, రాహుల్ గాంధీల సారధ్యంలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నాయకత్వంలో పేదల ఆకాంక్షలు సాకారమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు మునిగెల నర్సింగ్, కౌన్సిలర్లు బండారి సతీష్, సంద నర్సింగ్, దర్శనాల లక్ష్మణ్, నాయకులు లోక ప్రవీణ్రెడ్డి, సుధాకర్ గౌడ్, దొగ్గరి రాజేశ్వర్, లత, ప్రభావతి, శ్రీ లేఖ, సోనియా పాల్గొన్నారు.

**పార్టీ మాజీ అధ్యక్షుడి ఆధ్వర్యంలో...**
మాజీ మంత్రి దివంగత రాంచందర్ రెడ్డి నివాసంలోనూ సోనియాగాంధీ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మాజీ నేత సాజిద్ ఖాన్, కౌన్సిలర్ అంబకంటి అశోక్ తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. తామే తెలంగాణ తెచ్చామని బీఆర్ఎస్ చెప్పుకోవడం సిగ్గుచేటని, విద్యార్థుల ఆత్మబలిదానాలకు చలించి పార్టీ భవిష్యత్తును పణంగా పెట్టి తెలంగాణ ఇచ్చిన దేవత సోనియమ్మ అని సాజిద్ ఖాన్ కొనియాడారు.

## విద్యార్థులకు చట్టాలపైన అవగాహన

**ఆసిఫాబాద్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**



జిల్లా ఎస్పీ డివి.శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు . ప్రభాకర్ రావు అడిషనల్ ఎస్పీ పర్యవేక్షణలో ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలో ఆసిఫాబాద్ మండల్ బాబా పూర్ విలేజ్ మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గర్ల్స్ హాస్టల్‌లో షీటీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీం ఇంచార్జి సునీత గారు మాట్లాడుతూ, మహిళలపై హింస , ఈవ్టీజింగ్ , సైబర్ క్రైమ్ లకు ఎవరైనా గురి అయినట్లయితే వెంటనే షీటీం ను సంప్రదించాలని సూచించారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల అయినా ఫేస్బుక్, వాట్సప్, ఇన్స్టాగ్రామ్ వంటి వాటిని వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు.అదేవిధంగా జిల్లాలోని మహిళలకు రక్షణ కల్పించడం కోసమే షీ టీంలు పనిచేస్తున్నాయని, అలాగే ఏదైనా అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేయాలని పేర్కొన్నారు. షీ టీం ఆసిఫాబాద్ ఫోన్ నంబర్ 8712670564 కు సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రత్నాబాయి ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయ సిబ్బంది, షీ టీం సభ్యులు శ్రీలత మరియు సప్న పాల్గొన్నారు.



## పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**ఆసిఫాబాద్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) దేవిడ్‌కి సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. జిల్లాలో ఇటీ వల కురిసిన వర్షాల వలన రైతుల పంటలు చాలా దెబ్బ తిన్నాయనీ దీని వలన రైతులకు అపర నష్టం వాటిల్లిందని అని రైతులను ప్రభుత్వమే అదుకోనేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం పార్టీ నాయకులు అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) దేవిడ్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ నాయకులు మాట్లాడుతూ జిల్లాలో పత్తి పంట మొదటి స్థానంలో ఉంటుంది అని అదే సందర్భంలో వరి కూడా ప్రధానంగా ఉంటుంది అని అన్నారు రెండు రోజులుగా కురిసిన వర్షానికి వరి,పత్తి వర్షాల వలన తడవడం వలన రైతులకు చేతికి వచ్చిన పంట వర్షాల వలన తీవ్ర నష్టం జరిగింది కావున జిల్లా లో వర్షాల వలన తడిసిన పత్తి, వరి పంటను ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు.. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం.ఆనంద్ కుమార్.రాజేందర్ ఉన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత బీజేపీ, బీఆర్ఎస్‌లకు లేదు

### పార్టీ ఇన్‌చార్జి నారాయణరావు పటేల్...





**ముథోల్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను దశలవారీగా అమలుచేస్తున్నదని లబ్ది పొందుతున్న ప్రజలకు ఆ విషయం తెలుసు అని ముథోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి నారాయణరావు పటేల్ అన్నారు.ఇచ్చిన హామీ మేరకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రూ" 21వేలకోట్లతో 21 లక్షల మంది రైతులకు ఇప్పటికే రుణమాఫీ చేసిందని సూచించారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేస్తామని తొమ్మిదియేండ్లు ముబ్బపెట్టి మోసం చేసిందన్నారు.వారి పదవీకాలంలో రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులు పేదలకు పక్కగృహాలు అందని ద్రాక్షగా మారాయని నారాయణరావు పటేల్ అన్నారు. కేంద్రంలో దేశంలో మెజారిటీ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ఏ ఒక్క రైతుకన్న రూ" 2లక్షల రుణం మాఫీచేసిందా అని నారాయణరావు పటేల్ ప్రశ్నించారు.? ఆ పార్టీ రూ.16లక్షల కోట్ల ఇండస్ట్రియల్ రుణాలను మాఫీ చేసింది కానీ రైతులను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. పంజాబ్,హర్యానా రైతుల సమస్యలకు పరిష్కారం చూపకపోవడం బిజెపి పాలకుల చేతకానితనానికి నిదర్శనం అన్నారు.ఎన్నికల ముందు రూ" 15 లక్షలు వేస్తామని 18 లక్షల జన్దన్ ఖాతాలను తెరిపించిన బిజెపి నాయకులు చివరికి ప్రజలకు మొండిచెయ్యి చూయించారని కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి నారాయణరావు పటేల్ విమర్శించారు.బిజెపి బిఆర్ఎస్ పార్టీలకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదన్నారు.ఆ పార్టీలు చేసే విమర్శలను కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు సామాజిక మాధ్యమాల ద్వారా ఖండించాలని ఆయన పిలుపు ఇచ్చారు.రాష్ట్రంలో యేదాది కాంగ్రెస్ పాలన పూర్తి, సోనియాగాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి నారాయణరావు పటేల్ భైంసా క్యాంపు కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుదర్శన్ పటేల్ గంగారెడ్డి బంకబాబు రాంచందర్ రెడ్డి బషీర్ శంకర్ చంద్రే రమేష్ లతో పాటు పార్టీ అయ విభాగాల ఇన్చార్జిలు నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## 16న కలెక్టరేట్ ఎదుట టిపిటిఎఫ్ ధర్నా

**నిర్మల్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**



నిర్మల్ పట్టణ ప్రాథమిక పాఠశాల బాగులవాడ ప్రధానోపాధ్యాయుడు ఆరేపల్లి విజయకుమార్ అక్రమ సస్పెన్షన్ను తక్షణం ఎత్తివేసి పునర్నియామకం చేయాలనే డిమాండ్ తో ఈనెల 16న కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమం చేపట్టనున్నట్లు నిర్మల్ జిల్లా టిపిటిఎఫ్ నాయకత్వం తెలిపింది.ఈ మేరకు సోమవారం అక్రమంగా చేసిన సస్పెన్షన్ ను ప్రశ్నిస్తూ, సస్పెన్షన్ తక్షణం ఎత్తివేయాలంటూ జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ధర్నా నోటీసులు ఇచ్చారు .అంతేకాకుండా అక్రమ సస్పెన్షన్ చేసిన తీరును దుయ్యబడుతూ ఒక కరపత్రాన్ని సైతం టి పి టి ఎఫ్ నాయకులు విజయ్ కుమార్ ,ధర్మారావు,రఘు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వాజిద్ అహ్మద్ ఖాన్ తదితరులు విడుదల చేశారు .టిపిటిఎఫ్ జిల్లా శాఖ చేపట్టబోయే 'ధర్నా 'కార్యక్రమానికి జిల్లాలోని ప్రజాసంఘాలు , ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆ కరపత్రంలో కోరారు .టిపిటిఎఫ్ రాష్ట్ర శాఖ నాయకులతో పాటు ఎమ్మెల్సీ కోదండరాం, పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ హరగోపాల్,మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిరుపతయ్య, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర నాయకత్వం పాల్గొనన్నట్లు ఆ కరపత్రంలో తెలిపారు.

## 16న ఉట్నూర్ ఐటీడీఏ ముట్టడి

**ఆదిలాబాద్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
కోలాంల అభివృద్ధికి వచ్చిన పీఎం జన్మన్ నిధులను ఐటీడీఏ అధికారులు పక్కదారి పట్టించారని కోలం సేవ సంఘం అధ్యక్షుడు కొడప సోనేరావ్ అన్నారు. 16న చేపటనున్న ఐటీడీఏ ముట్టడి కార్యక్రమంపై స్థానిక అంబేద్కర్ భవనంలో రౌండ్ టెబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముట్టడికి సంబంధించిన పోస్టలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కోలాం సేవ సంఘం అధ్యక్షుడు సోనేరావ్ మాట్లాడుతూ మన్నెవార్లు ఆదివాసీ ప్రాంతాల్లో కొలవార్లుగా చలామణి అవుతు కోలం హక్కులను కొల్లగొట్టుతున్నారన్నారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్న పీఎం జన్మనిధులను కూడా ఐటీడీఏ అధికారులు పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. దీని కారణంగా కోలాంలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈనెల 16న ఉట్నూర్లోని ఐటీడీఏ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నామని. కోలాం సంఘం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.



# జిల్లాలో గ్రూప్-2 పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలి



## అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్


మంచిర్యాల, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం) జిల్లాలో ఈ నెల 15, 16 తేదీలలో జరుగనున్న గ్రూప్-2 పరీక్షను సమర్థవంతంగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. జిల్లాలో పరీక్ష నిర్వాణ కొరకు 48 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, 14 వేల 951 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని, పరీక్ష నిర్వహణ కొరకు నోడల్ అధికారిగా జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, పోలీస్ నోడల్ అధికారిగా బెల్లంపల్లి ఎ.ఆర్.ఎ.సి.పి. సుందర్, రీజియన్ కోఆర్డినేటర్గా బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ దేవేందర్రెడ్డిలను నియమించడం జరిగిందని, ప్రతి పరీక్ష కేంద్రానికి ముఖ్య పర్యవేక్షకులు, ఇన్విజిలేటర్లు, శాఖ అధికారులు, ఐడెంటిటీ, బయోమెట్రిక్ వెరిఫికేషన్, రూట్, జాయింట్ రూట్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్లను నియమించడం జరిగిందని తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రంలో వైద్య సిబ్బంది, పోలీసు సిబ్బంది అందుబాటులో ఉంటారని, తాగునీరు, మూత్రశాలలు, నిరంతర విద్యుత్ సరఫరా ఇతర అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 8:30 గంటలు, మధ్యాహ్నం 1.30 గంటల నుండి పరీక్ష కేంద్రంలోనికి అనుమతించడం జరుగుతుందని, ఉదయం 9:30 గంటలకు, మధ్యాహ్నం 2.30 గంటలకు గేట్లు మూసివేయడం జరుగుతుందని, తదుపరి ఎవరిని అనుమతించడం జరగదని తెలిపారు. అభ్యర్థులు తమ వెంట హాల్ టికెట్, ఒరిజినల్ ఫోటో గుర్తింపు కార్డు నలుపు, నీలం బాల్ పెన్నులు తెచ్చుకోవాలని తెలిపారు. హాల్ టిక్కెట్పై గత 3 నెలల లోపు దిగిన ఫోటో అతికించాలని, హాల్ టిక్కెట్ ఎ4 కాగితంపై ప్రింట్ తీసుకోవాలని, హాల్ టిక్కెట్ సరిగా లేనట్లయితే అభ్యర్థి 3 పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకొని గెజిటెడ్ అధికారి ద్వారా అటెస్ట్ చేయించుకొని వెబ్సైట్లో ఉన్న నమూనాలో సంతకం చేసి ఇన్విజిలేటర్కు ఇవ్వవలసి ఉంటుందని తెలిపారు. మొబైల్ ఫోన్లు, పేజర్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, కాలిక్యులేటర్, ఎనలాగ్/డిజిటల్ గడియారాలు, బ్లూటూత్ లోపలికి అనుమతించబడవని తెలిపారు. హాల్టికెట్, వెరిఫికేషన్ కొరకు మహిళా సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్ష ఓ.ఎం.ఆర్. విధానం ద్వారా జరుగుతుందని, అభ్యర్థులు హాల్ టికెట్ ప్రకారం వారికి కేటాయించిన గదులలోకి సమయానికి వెళ్లాలని తెలిపారు. ఈ నెల 15న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పేపర్ -1, మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్ -2, 16వ తేదీ ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పేపర్ - 3, మధ్యాహ్నం 12:30 గంటల వరకు పేపర్ -4 పరీక్షలు ఉంటాయని తెలిపారు. ఉదయం పరీక్షకు మధ్యాహ్నం 12:30 గంటలు, మధ్యాహ్నం పరీక్షకు సాయంత్రం 5.30 గంటల వరకు అభ్యర్థులు పరీక్షా కేంద్రం గదిలోనే ఉండాలని, పరీక్ష రాసిన అనంతరం ఓ.ఎం.ఆర్. షీట్లను ఆయా ఇన్విజిలేటర్లకు అందించి పరీక్ష ప్రశ్నాపత్రమును తీసుకువెళ్లవచ్చని తెలిపారు. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తి స్థాయిలో వసతులు కల్పించడం జరిగిందని తెలిపారు.

## పంచాయతీ కార్యదర్శుల సమస్యలను
# పరిష్కరించాలి



కుభీర్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామంలో ఉన్న పంచాయతీ కార్యదర్శులకు అధిక పని భారంతో ఎన్నో ఇబ్బందులు ఎదురుకోవడం జరుగుతుందని, పని భారం తగ్గించేలా చూడలని మండల అధికారి ఎంపీడీఓ నవనీత్ కుమార్కు మండల పంచాయితీ కార్యదర్శి సంఘం అధ్యక్షులు పవర్ విజయ్ కుమార్ ఆధ్వర్యములో సోమవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయితీ కార్యదర్శిలతో కలసి ఎంపీడీఓకు వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ వినతిపత్రంలో ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తి కావడం జరిగింది కానీ పంచాయతి కార్యదర్శిల సమస్యలను మాత్రం ఇప్పటి వరకు పరిష్కరించకపోవడం చాలా బాధాకర విషయం. దింతో సమాచార సేకరణలో భాగంగా ప్రజా పాలనా దరఖ్సస్తుల స్వకారణ ఆన్లైన్ సర్వేలు, డిజిటల్ కార్డులు, కులగనన, ఆర్థిక సర్వే,అదే విదంగా ఇందిరమ్మ గృహ నిర్మాణా లబ్ధిదరుల ఎంపిక మొదలైన పనులను పంచాయితీ కార్యదర్శిల చేపట్టటం, ఇట్టి సర్వేలను క్షేత్ర స్థాయిలో ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తూ విజయవంతంగా చేపట్టడం జరుగుతుంది. కానీ పంచాయితీ కార్యదర్శిలు క్షేత్ర స్థాయి విధి నిర్వహణలో ఎన్నో సమస్యలు ఎదురుకొంటున్న కార్యదర్శిలు ప్రత్యేక అధికారుల పాలనలో నిధుల సమస్యతో పాటు అధిక పనిభారంతో ఆర్థికంగా మానసికంగా కృంగిపోతున్నారు. దింతో ప్రభుత్వం వెంటనే సమస్యల పరిష్కారానికి స్పష్టమైన ప్రకటన విడుదల చేసి దీర్ఘాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలి కోరారు. పలు డిమాండ్స్ తో కూడిన వినతిపత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పంచాయితీ కార్యదర్శి లు పవర్ విజయ్ కుమార్ తోట సంజు కామల్ సింగ్ వినోద్ కుమార్ కిరణ్ కుమార్ కూనల్ ఆయా గ్రామాల పంచాయితీ కార్యదర్శిలు తదితరులు ఉన్నారు.

## ప్రజల సమస్యలను
# తక్షణం పరిష్కరించాలి



నిర్మల్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం) ప్రజల సమస్యలను తక్షణం పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి లో భాగంగా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ తో కలిసి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. విద్య, వైద్యం, ధరణి, పింఛన్లు, రెవెన్యూ, వ్యవసాయం తదితర సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. శాఖల వారీగా వచ్చిన ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, ప్రాధాన్యక్రమంలో పరిశీలించాలని, నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదుదారులకూ పరిష్కార అంశాల సమాచారం అందించాలన్నారు. అనంతరం శాఖల వారీగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార పురోగతిని సమీక్షించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్లను విడుదల చేయాలి



ఉట్నూర్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం) తెలంగాణ ఆదివాసి విద్యార్థి సంఘం (టీఏవీఎస్) ఆధ్వర్యంలో ఉట్నూర్ ఐటీడీఏ పీవో ను కలిసి పెండింగ్ లో ఉన్న గిరిజన విద్యార్థుల స్కాలర్షిప్ రియంబర్స్మెంట్ లను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తనుష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత సంవత్సరం నుండి గిరిజన విద్యార్థుల పోస్టుమెట్రిక్ స్కాలర్షిప్ల పెండింగ్లో ఉన్నాయి. దీనివలన వేలాది మంది గిరిజన విద్యార్థులు తమ ఇంటర్, డిగ్రీ, పీజీ, బీఈడీ, అకాడమిక్ ఫీజులు ప్రభుత్వం నుండి కాలేజీలకు అందకపోవడం వలన వారి సర్టిఫికెట్లు చేతికి రాక ఇబ్బందులు పడుతున్నారనీ. ఇతర ఉన్నత చదువులకు గాని లేదా ఉద్యోగాలకు గానీ దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. ఇట్టి అంశాన్ని దృష్టిలో పెట్టుకొని పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్లను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మడవి నాగోరావ్, కనక మల్లు, కోవా సునీల్ పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఆసిఫాబాద్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం) కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న కస్తూరిబా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఏడి గ్యాన్మెల్ కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కస్తూరిబా ఎస్ఓ లు మాట్లాడుతూ విద్యాశాఖ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని, భావి భారత పౌరులుగా విద్యార్థులను దిద్దే తాము ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా విధులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యాశాఖలోని సమగ్ర శిక్ష మన రాష్ట్రంలోని విద్యా రంగ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది అన్నారు. ఎన్నో ఏళ్లు గా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నామని ఇప్పటికైనా తమను గుర్తించి ఆదుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సమగ్ర శిక్ష సిబ్బందిని విద్యాశాఖలో విలీనం చేసి తమను రెగ్యులర్ చేయాలని, అప్పటివరకు తక్షణమే పేస్కేల్ అమలు చేయాలని, ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూపాయలు 10 లక్షల వరకు, ఆరోగ్య భీమా సైతం 10 లక్షల వరకు సౌకర్యం కల్పించాలనే తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని వారు అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ప్రతినిధులు నలంద, నాగసుధ,అరుణ, స్వప్న, పవిత్ర, ప్రవీణ ,సుమలత, రమాదేవి, ధర్మయ్య ఉన్నారు.

## మందమర్రిలో సోనియా గాంధీ
# జన్మదిన వేడుకలు



మందమర్రి, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం) మందమర్రిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోనియాగాంధీ 77 వ పుట్టిన రోజు వేడుకలు జరిగాయి. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉపేందర్, పీసీసీ సభ్యుడు గుడ్ల రమేష్, సీనియర్ నాయకుడు సొత్కు సుదర్శన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. సొత్కు సుదర్శన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు సోనియా గాంధీ కీలక పాత్ర పోషించారు. అమరవీరుల త్యాగాలు వృథా కాలేదు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్ర రాజు, ఎండీ పాషా, తిరుపతి యాదవ్, నెరువట్ల శ్రీనివాస్, శామ్యూల్, అర్జున్, శనిగారపు సాగర్, సారంగపాణి కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# షార్ట్ సర్క్యూట్తో పత్తి దగ్ధం

జైనథ్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం) జైనథ్ మండలంలోని ఆనందపూర్ గ్రామంలో ఇంట్లో నిల్వ ఉంచిన పత్తి ప్రమాదవశాత్తు కాలిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన వచ్చిన అని రైతు 20 క్వింటాళ్ల పత్తిని ఇంట్లో నిల్వ ఉంచాడు. ప్రమాదవశాత్తు కరెంటు వైర్ తగలడంతో కొంతమేరకు పత్తి పంట దగ్ధమైంది. వెంటనే స్థానికులు సకాలంలో స్పందించి నీళ్లతో మంటను అదుపులో చేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.



# నిరుద్యోగులను పట్టించుకోని ప్రభుత్వం



**మంచిర్యాల, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**

కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం యువ మోర్చా ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి పాల్గొన్నారు. ర్యాలీని కలెక్టరేట్ కార్యాలయం వద్ద పోలీసులు అడ్డుకోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీని ప్రారంభించి బెల్లంపల్లి చౌరస్తా మీదుగా బీజేపీ కార్యాలయం వరకు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ర్యాలీ కోసం ఏసీపీ కార్యాల యంలో అనుమతి పెట్టుకుంటే ఎమ్మెల్యే అనుమతి ఇవ్వకుండా అడ్డుకు న్నారన్నారు. నాయకులు రజినీష్‌జైన్, కృష్ణమూర్తి, అశ్విన్, రమణరావు, శ్రీదేవి, అశోక్, చక్రి, సదానందం పాల్గొన్నారు. అదే విధంగా నస్పూర్‌లో యువ మోర్చ నిరసన ర్యాలీ నిర్వహించింది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చనందుకు నిరసనగా యువ మోర్చ నిరసన ర్యాలీ నిర్వహించింది. తెలంగాణలో ప్రభుత్వమే మారిందని పాలన మాత్రం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీల గారడీ చేస్తుందని, ఆరు అబద్దాలు 66 మోసాలంటూ ముద్రించిన కరపత్రాలను కలెక్టర్ చౌరస్తా వద్ద జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ పంపిణీ చేశారు. ఎన్నికల సందర్భంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సాధించింది శూన్యమని బీజేపీ నాయకులు సంజీవరావు తెలిపారు. విలేకరులతో మాట్లాడుతూ ఏదో సాధించినట్లు సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ఒక వైపు రైతులు వర్షాలతో పంట నష్టపోతే కనీసం సంబంధిత అధికారులు పంట నష్టం అంచనా వేయడం లేదని మండిపడ్డారు. నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, లేని పక్షంలో ఆందోళన చేపడతామని తెలిపారు.

## బోథ్‌లో ప్రెస్ క్లబ్‌కు కోసం
# స్థలాన్ని కేటాయించండి



**బోథ్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**

బోథ్ మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని కోరుతూ సోమవారం జర్నలిస్టులు తహశీల్దార్ సుభాష్ చందర్ కు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సూది నరేష్ మాట్లాడుతూ.. నియోజకవర్గ కేంద్రమైన బోథ్‌లో ప్రెస్‌క్లబ్‌కు భవనం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని కోరారు. ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులున్నారు.

## తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

**కన్నెపల్లి డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**

అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కొయ్యల ఏమాజీ, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవిలు డిమాండ్ చేశారు. ముత్తాపూర్ కొనుగోలుకేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. కొనుగోలు చేయాలని లేకుంటే ఆందోళనలు చేస్తామన్నారు.

# 17న ధర్మాగ్రహ దీక్షను జయప్రదం చేయండి




**ఆదిలాబాద్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**

పెండింగ్‌లో ఉన్న 4 డీఏలు, పీఆర్సీ వెంటనే ప్రకటించాలని, పెండింగ్ బిల్లులన్నీ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 17న తపస్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద చేపట్టనున్న ధర్మాగ్రహ దీక్షను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సునీల్ చవాన్, గోపికృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను పట్టణంలోని శిశుమందిర్ పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తపస్ జిల్లా అధ్యక్షుడు సునీల్ చవాన్ మాట్లాడుతూ ఎన్నో ఆశలతో కొలువు దీరిన కొత్త ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా పెండింగ్ బిల్లుల సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని ఆశించామన్నారు. కానీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఒక సంవత్సరం పూర్తయినా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నందున తపస్ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యచరణ రూపొందించి దశల వారీగా పాఠశాలల్లో నల్లబ్యాడ్జీలతో నిరసన, మండల స్థాయిలో తహసిల్దారులకు వినతిపత్రం సమర్పణ, జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ల వద్ద ధర్నా నిర్వహించామని తెలిపారు. ఇందులో భాగంగా డిసెంబర్ 17న ఇందిరాపార్కులో 5వేల మంది ఉపాధ్యాయులతో ధర్మాగ్రహ దీక్ష చేపడుతున్నామని, ఈ దీక్షకి జిల్లానుండి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆర్థిక కార్యదర్శి బచ్చు నారాయణ, నాయకులు మెస్రం రాజ్ కుమార్, బత్తుల గంగాధర్, చదల రాజేష్, గోమంత్ రెడ్డి, సురేష్,ఆకాష్, వీరయ్య, గంభీర్, రాజశేఖర్, ప్రకాష్ మహిళా ప్రతినిధులు కుర్సెంగా జీజబాయి, సంగీత పాల్గొన్నారు.

## ఉట్నూర్‌లో ఘనంగా
# సోనియా గాంధీ జన్మదిన వేడుకలు



**ఉట్నూర్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**

ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ క్యాంప్ ఆఫీస్‌లో సోమవారం సోనియా గాంధీ జన్మదిన వేడుకలు జరుపుకొన్నారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# చలో హైదరాబాద్ జయప్రదం చేయండి



**ఆదిలాబాద్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**

అంగన్వాడి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈనెల 12న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటీయూ జిల్లా అధ్యక్షుడు అన్నమొల్ల కిరణ్ కోరారు. ఇందులో భాగంగా ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి ఈనెల 12న అంగన్వాడీ ఉద్యోగులకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సోమవారం డిడబ్ల్యుఓ సబితకు తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో అంగన్వాడీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెన్ ఫీట్స్ సాధన కోసం ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో సునీత, ముక్త, సుజాత, కళ్యాణి, పార్వతి ఉన్నారు.

# ప్రజావాణి అర్జీలను పరిష్కరిస్తాం
## అదనపు కలెక్టర్ ఎం డేవిడ్...

**ఆసిఫాబాద్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**

ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరిస్తామని అద నపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరిం చారు వాంకిడికి చెందిన అమృత తనకు దివ్యాం గ పెన్షన్ ఇప్పించాలని దరఖాస్తు అంద జేశారు. చింతలమానేపల్లి మండ లం బాలాజీ అనుకోడ గ్రామానికి చెందిన లక్ష్మీతనకు వృద్ధాప్య పింఛన్ ఇప్పిం చాలని దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ పట్టణంలోని నూర్‌నగర్ కాలనీవాసులు సీసీ రోడ్డు నిర్మించాలని, కౌటాల మండలం ధనూరెడ్డి గ్రామానికి చెందిన దేవక్క తన కూతురు దివ్యాంగురాలు అయినందున పెన్షన ఇప్పించాలని అర్జీలు సమర్పిం చారు. సిర్పూర్(టి) మండలం లోనవెల్లికి చెందిన కమల జిల్లాపరిషత్ పాఠశాలలో స్కావెంజర్ ఉద్యోగం ఇప్పించాలని, కెరమెరి మండలం దేవాపూర్‌కు చెందిన సంగీత తనకు అంగన్‌వాడీ సహాయకురాలిగా ఉద్యోగం ఇప్పించా లని దరఖాస్తు అందజేశారు.

## నేడు వ్యవసాయ గణనపై
# అధికారులకు శిక్షణ

**నిర్మల్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**

11వ ప్రపంచ వ్యవసాయ గణన చేసేందుకు జిల్లా ప్రణాళిక అధికారి జి.జీవరత్నం ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ శాఖ ఏ ఈ ఓ లు మండల గణాంక అధికారులు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా మంగళవారం మధ్యాహ్నం 2:30 గంటలకి నిర్మల్ కలెక్టరేట్లో జిల్లాలోని వ్యవసాయ మండల అధికారులు ఏ ఈ వో లు మండల గణాంక అధికారులు 11వ ప్రపంచ వ్యవసాయ శిక్షణ కార్యక్రమం పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ జిల్లా ప్రణాళిక అధికారి జి.జీవరత్నం కొనసాగిస్తారు. గతంలో 2021-22 సంవత్సరంలో జిల్లాలో రైతులు ఏఏ పంటలు పండించారనే అంశంపై ఏఈవోలు యాప్ ద్వారా డౌన్లోడ్ చేసి వివరాలు సేకరించాల్సి ఉంటుంది అలాగే ఎరువుల వినియోగం, పంటలు దిగుబడిని పరిగణలోకి తీసుకున్నారు. అయితే ఫేజు-1 జిల్లా వ్యాప్తంగా 424 రెవెన్యూ గ్రామాల్లో ఆరు నెలల క్రితమే జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ శాఖ ఏఈవోలు రైతుల ఏవి సర్వే నెంబర్లలో వ్యవసాయదారుల సామాజిక వర్గం వివరాలు సేకరించి నివేదికలు సిద్ధం చేసుకున్నారు. ఆయా గ్రామాలకు సంబంధించి ఫేజు-2లో జిల్లాలో 97 గ్రామాలను భారత ప్రభుత్వం ర్యాండమ్ శాంప్లింగ్ పద్ధతి ద్వారా మినిస్ట్రీ అగ్రికల్చర్ రైతులతో కలసి ఎంపిక చేసిన వాటిలో రైతాంగం సాగుచేసిన పంటల వివరాలు సేకరించనున్నారు. జిల్లావ్యాప్తంగా 20% గ్రామాల్లో ఫేజు-1 సర్వే కొనసాగుతుంది . ఇక ఫేజు-3లో మండల గణాంక అధికారులు జిల్లా వ్యాప్తంగా ఏడు శాతం అంటే 39 గ్రామాల్లో పంటల సాగు బడికి రైతులు వినియోగించిన ఎరువులు, ఆయా పంటల దిగుబడికి ఎంత ఖర్చు వచ్చిందన్న అంశాలను సర్వే చేసి గణాంక శాఖకు ఈ నెలాఖరులోపు నివేదికలు అందించాల్సి ఉంటుంది. దాంతో జిల్లాలో మంగళవారం శిక్షణతో ప్రారంభమై ఈ నెల 31 వరకు 11వ ప్రపంచ వ్యవసాయ గణన చేపట్టనున్నారు.

### తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే

## కొనుగోలు చేయాలి

**నెన్నెల, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
అకాల వర్షాలతో తడిసిన ధాన్యం, పత్తికి మద్దతు ధర చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. నెన్నెల రైతులతో సోమవారం మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజీ మాట్లాడారు. వర్షానికి తడిసిన ధాన్యాన్ని, పత్తిని పరిశీలించారు. ప్రభుత్వం సక్రమంగా ధాన్యం సేకరణ చేపట్టక పోవడం వల్లే రైతులు నష్టపోయారని అన్నారు. నామమాత్రంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని, సెంటర్లలో కనీస సౌకర్యాలు లేవన్నారు. టార్పాలిన్లు లేక ధాన్యం తడిసిందన్నారు. కొందరు రైతుల ధాన్యం నల్లబడి మొలకలు వచ్చిందన్నారు. రైతులు, ప్రజలు ఇక్కట్ల పాలవుతుంటే ఎమ్మెల్యే గడ్డం వినోద్, అధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదని ఆరోపించారు. రైతాంగానికి న్యాయం జరిగే వరకు తమ పార్టీ అండగా ఉండి పోరాడుతుందన్నారు. జిల్లా కార్యదర్శి గోవర్ధన్, నాయకులు అజ్మీరా శ్రీనివాస్, కమల ఉన్నారు.

## అక్రమంగా పశువులు రవాణా

### ముగ్గురిపై కేసు నమోదు

### పట్టుబడ్డ పశువులను గోశాలకు తరలింపు

**కాగజ్‌నగర్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
హైదరాబాద్‌కు అక్రమంగా తరలి స్తున్న 6 పశువులను సోమవారం ఉదయం ఎస్.ఐ. కొమురయ్య ఆధ్వర్యంలో పట్టుకున్నారు. ఎల్కపల్లి నుంచి పశువులను తీసుకెళ్తున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు, రాస్పల్లి గ్రామ సమీపంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద ఉదయం 3 గంటల సమయంలో బులెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. వాహన డ్రైవర్ అంబిలపు శ్రీకాంత్, జాడీ రవీందర్, చిట్యాల సత్యనారాయణ అనే ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు అధికారులు తెలిపారు. పట్టుబడ్డ పశువులను గోశాలకు తరలించారు.

## రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యాభారతి విద్యార్థుల ప్రతిభ




**తాండూర్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా లక్సెట్‌పేటలో ఈ నెల 8వ తేదీన జరిగిన రాష్ట్రస్థాయి కరాటే కుంగ్‌ఫు ఛాంపియన్షిప్ పోటీ తైక్వాండోలో మండలంలోని విద్యా భారతి పాఠశాల చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి బంగారు పతకాలు, కాంస్య పతకాలు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ సురభి శరత్ కుమార్ తెలిపారు. ఈ పోటీల్లో 9,10,13 సంవ త్సరాల కటాస్ విభాగంలో కోట లక్ష్మీ నిహా రిక, పులగం నందితా, కామని నక్షత్రలు 12,13 సంవత్సరాల స్పారింగ్ విభాగంలో సార్ల మోక్షిత్, గంధ శ్రీ విశ్వక్ తేజ్ లు బంగారు పతకాలు సాధించగా 11,12 సంవత్సరాల స్పారింగ్ విభాగంలో రాజ్ పురోహిత ధన రూప్ సింగ్, కస్తూరి శివ చరణ్ లు కాంస్యపతకాలు సాధించడం జరిగింది. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ సరోజిని, పీఈటీలు, ఉపాధ్యాయులు, కరాటే మాస్టర్ సెక్రెటరీ రాజేష్, ఇప్ప శ్రావణి లు అభినందించడం జరిగింది.

## సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

**కాసిపేట, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**



మండల కేంద్రంలో తెలంగాణ తల్లి సోనియా గాంధీ 78వ జన్మదిన వేడుకలను మండల పార్టీ అధ్యక్షుడు రత్నం ప్రదీప్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర యూత్ సెక్రెటరీ మాట్లాడుతూ సోనియా గాంధీ జన్మదినం రోజునే తెలంగాణ రాష్ట్రంలోమహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా పేదలకు ఉచిత10 లక్షల వైద్య సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో ప్రజలంతా సంతోషంతో ఉన్నారని అన్నారు. తెలంగాణ స్వరాష్ట్ర కళా ఎన్నో ఏళ్ల పోరాటం, ఎన్నో త్యాగాల గుర్తులు, ఆ కలలను నిజం చేస్తూ ఇచ్చిన మాట తప్పని గుణం సోనియమ్మదని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన తల్లి సోనియమ్మ జన్మదిన వేడుకలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

**జైపూర్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
జైపూర్ మండల కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలు సోమవారం కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు సోషల్ మీడియా వారియర్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జైపూర్ మండలం సోషల్ మీడియా కోఆర్డినేటర్ సతీష్ కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సోనియా గాంధీ కృషితో వచ్చిందని. 60 సంవత్సరాల ప్రజలు యువకులు నిరుద్యోగులు యువత బలిదానాలతో చలించిపోయిన సోనియా గాంధీ ఆంధ్ర పాలకుల నిర్లక్ష్యాన్ని వారి దోపిడిని తెలుసుకున్న సోనియా గాంధీ నాటి యూపీఏ ప్రభుత్వాన్ని ఒప్పించి మెప్పించి తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని తెలియజేశారు.

**సీనియర్ నాయకులు జన్మదిన వేడుకలకు దూరం...**
గత నాలుగు నెలల నుండి మండలంలోని అనేక గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఒకరి మీద ఒకరు వ్యతిరేకంగా ప్రచారం చేసుకుంటూ వ్యక్తిగత దూషణలకు వెళ్లి సొంత ప్రయోజనాల కోసం పార్టీకి గ్రామాలలో చెడ్డపేరు తీసుకవచ్చే విధంగ ప్రవర్తిస్తున్నారని అనేకమంది బయట ప్రచారం చేస్తున్నారు. జైపూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ గ్రూపులుగా విడిపోయి ఒకరి మీద ఒకరు స్థానిక శాసనసభ్యులు వివేక్ దృష్టికి తీసుకవెళుతున్నారని జోరుగా ప్రచారం జరుగుతుంది. కష్టపడి పనిచేసి గ్రామస్థాయిలో కాంగ్రెస్ బలాన్ని పెంచే విధంగా నాయకులు ఏమాత్రం అభివృద్ధి కార్యక్రమాలు చేయడం లేదని అనేక వాదనలు వినబడుతున్నావి స్థానిక శాసనసభ్యులు వివేక్ వెంకటస్వామి స్థానిక పెద్దపెల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ మండల పర్యటనలో ఉన్నప్పుడు గంటల గంటలు ఎదురుచూసే మండల సీనియర్ నాయకులు తెలంగాణ ఇచ్చిన తెలంగాణ తల్లి సోనియా గాంధీ జన్మదిన వేడుకల్లో పాల్గొనక పోవడం చాలా బాధాకరమని మండలంలోని ప్రజలు నాయకులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జైపూర్ మండలం యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అరుణ్ చెన్నూరు నియోజకవర్గం కాంగ్రెస్ యూత్ వైస్ ప్రెసిడెంట్ సృజన్ మండలంలోని వివిధ గ్రామాల సోషల్ మీడియా వారియర్స్. ప్రేమ్ యాదవ్ సాయి రవి గౌడ్ తిరుమల వాసు వెంకటేష్ శివ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

**బెల్లంపల్లి, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా సోమ వారం మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత మాట్లా డుతూ వార్డులను నిత్యం పరిశుభ్రంగా ఉంచు తూ ప్రజల ఆరోగ్యాలను రక్షించే కార్మికులు ఆరోగ్యంగా ఉండేందుకు ఎమ్మెల్యే వినోద్ ఆదే శాల మేరకు వైద్యపరీక్షలు చేయించినట్లు తెలిపారు. శానిటరీ కార్మికులు, డ్రైవర్లకు, ఆర్‌పీ లకు వైద్య పరీక్షలు చేయించినట్లు తెలిపారు. పారిశుధ్య కార్మికులను మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు శాలువాలతో సన్మానించారు. మున్సి పల్ కమిషనర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.





## గుట్టలు మాయం.. ప్రకృతికి గాయం

- గండి కొడుతున్నా.. గంతలా?
- జిల్లాలో యథేచ్ఛగా గ్రావెల్ దందా
- తవ్వకాలను పట్టించుకోని అధికారులు
- అనుమతులు లేకుండానే గ్రావెల్ తరలింపు
- మట్టి తరలిపోతున్నా కన్నెత్తి చూడని అధికారులు
- పగలు, రాత్రుల్లు తవ్వకాలతో తరిగిపోతోన్న మొరం
- ముథోల్ నియోజకవర్గంలో రెచ్చిపోతున్న మట్టిమాఫియా

**ముథోల్, డిసెంబర్ 3 (ప్రభాత సమాచారం)**
ముథోల్ మండల కేంద్రంలోని పలు గ్రామాల్లో విచ్చలవిడిగా మొరం అక్రమ తవ్వకాలు జోరుగా కొనసాగుతున్నాయి. మైనింగ్ శాఖ పోలీస్ శాఖ రెవెన్యూ శాఖ నిద్ర మత్తులో ఉండటంతో మూడు పువ్వులు ఆరు కాయలుగా మట్టి మొరం అక్రమ క్వారీ జోరు అందుకుంది. అధిక సంఖ్యలో టిప్పర్ తరలి వెళ్తున్న సమాచారం మేరకు సదర అధికారులు ఒకటి రెండు టిప్పర్లను పట్టుకోవడం అలవాటుగా మారింది. ముథోల్ మండల కేంద్రంతో పాటు మచ్కల్, బ్రహ్మం గావ్, రూవ్వి గ్రామంలో అక్రమ మొరం దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. మండలంలో మొరం రవాణాకు ఆయా శాఖల అనుమతులు లేకున్నా దర్జాగా అక్రమ రవాణా కొనసాగుతోంది. ముథోల్ ,బాసర రహదారిపై ప్రతి రోజు 24 గంటలు మొరం ముథోల్ మండలం నుండి బాసర్‌తో పాటు నిజామాబాద్ జిల్లాలోని ఎంచ, పకిరబాద్, బోధన్ మండలానికి తరలిస్తున్నారు. అక్రమ మొరంపై పోలీస్ రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. మైనింగ్ శాఖ అధికారులుకు ఫిర్యాదు చేసిన తనిఖీ చేయడం లేదన్న విమర్శలున్నాయి. కొందరు అధికారులు సైతం మామూళ్ల బానిసై అక్రమ దందాను ప్రోత్సహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. తరోడా గ్రామానికి చెందిన అల్తాఫ్ అతివేగంతో టిప్పర్ నడుపుతూ అదుపు తప్పి గత 15 రోజుల క్రితం గురుకుల గిరిజన సంక్షేమ కళాశాల ముందు రోడ్డుకు పక్కన ఢీకొని బోల్తా పడటం తో మృతి చెందారు . ఈ ముథోల్ ప్రాంతం నుంచి ఎర్ర మట్టి తోపాటు మొరమును సైతం వివిధ ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ అనుమతులను తుంగలో తొక్కి కొందరు స్థానిక నాయకులు ఒక్కొక్క టిప్పర్ 15 వేల వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అయినప్పటికీ సదర్ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. పోలీస్ స్టేషన్ ముందు నుంచి అధిక సంఖ్యలో టిప్పర్ వెళ్తున్న పట్టించుకోని వారు కరువయ్యారు. ఎర్ర మట్టితో పాటు అక్రమ మొరము తరలింపు పై మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. స్థానిక నాయకులు అధికారుల పెత్తనం చెలయిస్తూ ఈ వ్యాపారం జోరు అందుకుంది. మచ్కల్ గ్రామంలో గుట్ట సైతం కర్పూరం లా కరిగిపోతున్న అటవీ శాఖ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు. గతంలో అటవీ శాఖ ఆధీనంలో టేకు మొక్కలు పెంచిన నరికి వేత గురవుతున్నాయి. ఫారెస్ట్ అధికారులు టేకు మొక్కలను నరికి వేస్తున్నప్పటికీ పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ టేకు దుంపలను ఇటిక బట్టలకు సైతం వాడుతున్నారు. మొరం అక్రమంగా తరలింపు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ మల్లేష్ 'ప్రభాతసమాచారం'కు తెలిపారు.





## ఆదిలాబాద్‌లో సైబర్ క్రైమ్
# కార్యాలయం ప్రారంభం

### సైబర్ క్రైమ్ బారిన పడితే 1930 నెంబర్‌ను సంప్రదించాలి ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్ ఆలం

**ఆదిలాబాద్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
సైబర్ క్రైమ్ బారినపడితే వెంటనే 1930టోల్ ఫ్రీ నంబర్‌కు సంప్రదించాలని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. సోమవారం పట్టణంలోని పోలీసు కార్యాలయంలో నూతన సైబర్ క్రైమ్ కార్యాలయాన్ని ఎస్పీ పాల్గొని జిల్లా పోలీసు ఉన్నతాధికారుల సమక్షంలో ప్రారంభించారు. ముందుగా ఎస్పీకి ఆదిలాబాద్ సైబర్ డి.ఎస్.పి హసీబుల్ల పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కార్యాలయాన్ని అత్యధిక సదుపాయాలతో, నూతన పరికరాలను అందజేసి సైబర్ బాధితులకు వెంటనే న్యాయం చేకూరే విధంగా శిక్షణను తీసుకున్న నిష్ణాతులతో సిబ్బందితో కార్యాలయాన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుత దేశంలో సైబర్ నేరగాళ్లు నూతన పద్ధతులను వినియోగించుకుంటూ ప్రజలను మోసం చేయడం జరుగుతుందని వాటి బారిన పడకుండా సైబర్ క్రైమ్ సిబ్బంది ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ చైతన్య పరుస్తూ ఉండాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఎలాంటి అత్యవసర సమయంలోనైనా టోల్ ఫ్రీ సైబర్ క్రైమ్ నెంబర్ 1930 కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. డబ్బు పోగొట్టుకున్న వెంటనే ఫిర్యాదు చేసినట్లయితే పోగొట్టుకున్న డబ్బును తిరిగి రాబట్టే అవకాశం ఉన్నందున అతి త్వరగా స్పందించి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇప్పటివరకు ఆదిలాబాద్ జిల్లాలో సైబర్ బారిన పడి నష్టపోయిన 90 మంది బాధితుల రూ. 17,62,381తిరిగి వారికి న్యాయశాఖ సహకారంతో అందజేసినట్లు తెలిపారు. సైబర్ సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి ఫిర్యాదులనైనా తక్షణమే స్పందిస్తూ బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా శిక్షణను తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ముఖ్యంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న వయోవృద్ధులు, ప్రజలు, విద్యార్థులు సైబర్ నేరగాళ్ల చే మోసపోకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్ట్, సోషల్ మీడియా ఫ్రాడ్స్, బ్యాంకు ఫ్రాడ్స్, అశ్లీల చిత్రాలను పోస్ట్ చేస్తామంటూ వివిధ రకాలైన



పద్ధతులలో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ ఉంటారని వారి చేతిలో మోసపోకుండా వెంటనే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ కు గాని సైబర్ క్రైమ్ వెబ్సైట్కు గాని సంప్రదించి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి సురేందర్ రావు, డీఎస్పీలు ఎల్ జీవన్ రెడ్డి, హసీబుల్లా, పోలీసు కార్యాలయం ఏవో భక్త ప్రహ్లాద్, సూపరింటెండెంట్లు సంజీవ్, గంగాధర్, ఇన్స్పెక్టర్లు డి సాయినాథ్, కరుణాకర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు డి వెంకటి, టి మురళి, ఎన్ చంద్రశేఖర్ సైబర్ క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

## రిమ్స్‌లో డెయిరీ పార్లర్
# ప్రారంభించిన కలెక్టర్



**ఆదిలాబాద్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
రిమ్స్‌కు వచ్చే రోగులు, వారి సహాయకులకు నాణ్యమైన విజయ డెయిరీ పాలు, పాల ఉత్పత్తులను అందించేలా రిమ్స్ ఆవరణలో పార్లర్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య ఆధ్వర్యంలో రిమ్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విజయ డెయిరీ పార్లర్‌ను కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అంతకుముందు డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, పర్యవేక్షకుడు డా.అశోక్ లు ఆయనకు స్వాగతం పలికి సత్కరించారు. తొలుత ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పాల ఉత్పత్తుల విక్రయాలను ప్రారంభించారు. జిల్లాలోని దూర ప్రాంతాల నుంచి రిమ్స్ ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకుల విజయ డెయిరీ ఆధ్వర్యంలో నాణ్యమైన పాలను అందించే ఉద్దేశ్యంతో పార్లర్‌ను ఏర్పాటు చేయడం హర్షనీయమని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. త్వరలో ఆర్టీసీ డిపోలోనే పార్లర్ ఏర్పాటు కానుందన్నారు. జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలు, గురుకుల విద్యాలయాలకు విజయ డెయిరీ పాలను అందించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. దూర ప్రాంతాల్లో ఉండే ఆశ్రమ పాఠశాలలకు సైతం విజయ డెయిరీ నుంచి పాలను సరఫరా చేసేందుకు డీడీ కృషి చేస్తున్నారన్నారు. దీనివల్ల అటు రైతులకు ఆదాయం పెంచేందుకు వీలు కలగడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన పాలు, పాల ఉత్పత్తులను అందించవచ్చన్నారు. డెయిరీ బలోపేతం కోసం ఇది దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ మేనేజర్లు తుషార్, దస్రు నాయక్, పంపిణీదారు నరేందర్, సిబ్బంది ఊశన్న, సతీష్ పాల్గొన్నారు.




# నూతన ఆవిష్కరణల దిశగా ఆలోచనలు సాగాలి




**ఆదిలాబాద్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
శాస్త్ర, సాంకేతిక రంగాలపై బాల్య దశ నుంచే అవగాహనను పెంపొందించుకుంటూ నూతన ఆవిష్కరణల దిశగా ఆలోచనలు సాగాలని డీఈవో ప్రణీత విద్యార్తులకు సూచించారు. సోమవారం పట్టణంలోని లిటిల్ స్టార్ పాఠశాలలో నిర్వహించిన స్కూల్ లెవల్ సైన్స్ ఎగ్జిబిషన్ కు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. చిన్నారులు తమ ప్రతిభా పాటవాలతో ఆలోచింపజేసేలా రూపొందించిన ఆవిష్కరణలు ఆకట్టుకున్నాయి. వర్షం నీటి సంరక్షణ, ట్రాఫిక్, పచ్చదనం, పరిశుభ్రత, నీటి శుద్ధి, సేంద్రీయ ఎరువుల తయారీ, చెత్త నుంచి విద్యుశ్ శక్తి తయారీ తదితర అంశాలను విద్యార్థులు తమ ప్రదర్శనల ద్వారా వివరించారు. నేటి మన సౌకర్యాలన్ని నాటి శాస్త్రవేత్తల ఆలోచనల నుంచి మొగ్గ తొడిగినవేనని, వినూత్న ఆలోచనలతో భావిశాస్త్రవేత్తలుగా ఎదగాలని డీఈవో ప్రణీత సూచించారు. మన నిత్య జీవితంలో సైన్స్ పాత్ర ఎనలేనిదని, ప్రతి అంశం ఆవిష్కరణతో ముడి పడి ఉన్నదేనని పేర్కొన్నారు. తరగతి గదికే పరిమితం కారాదని, ప్రయోగాల ద్వారా జరిగే బోధన మరింత ప్రభావవంతంగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రఘురమణ, ఆరె భాస్కర్, డీఈవో సీసీ రాజేశ్వర్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్, పాఠశాల ప్రిన్సిపల్ కమలాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతుల ఖాతాలలో
# 16 కోట్ల 22 లక్షల రూపాయలు జమ



**మంచిర్యాల, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లాలో 315 వరి ధాన్యం కొనుగోలు ద్వారా రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి 16 కోట్ల 22 లక్షల రూపాయల నగదు సంబంధిత రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రతిపాదించిన 326 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఇప్పటి వరకు 315 కొనుగోలు కేంద్రాల ద్వారా 18 వేల 45 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా ఇందులో 2 వేల 373 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం ఉందని, సంబంధిత 1 వేయి 56 మంది రైతుల ఖాతాలలో 16 కోట్ల 22 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 14 రైస్ మిల్లులకు సి.ఎం.ఆర్. అనుమతులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం దెబ్బతినకుండా గన్నీ సంచులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు.

# అవినీతి రహిత సమాజం కృషి చేయాలి

**మంచిర్యాల, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
అవినీతి రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరు నడుం బిగించాలని విజిలెన్స్ యాంటి కరప్షన్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ మోతే రాజలింగు అన్నారు. సోమవారం అంతర్జాతీయ అవినీతి నిర్మూలన దినోత్సవం సందర్భంగా విజిలెన్స్ యాంటీ కరప్షన్ కౌన్సిల్ విభాగం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో స్టాప్ కరప్షన్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సోషల్ డిటెక్టివ్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఆడెపు సురేందర్ మాట్లాడుతూ అవినీతిని పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. దేశంలో అవినీతి కరప్షన్ పెట్రేగిపోతుందన్నారు. కొన్ని రంగాల్లో లంచగొండితనం తగ్గిందని, అన్ని రంగాల్లో కొనసాగుతుందన్నారు. పూర్తి స్థాయిలో టెక్నాలజీ అందుబాటులోకి వస్తే లంచగొండి తనం తగ్గుతుందన్నారు. కొన్ని శాఖల్లో లంచం ఇవ్వకుండా ఏ పని జరగడం లేదని అవినీతిని పూర్తిగా రూపుమాపాలంటే సరైన పద్దతులను ప్రభుత్వాలు ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు సునీల్, నడిపెల్లి . సునీల్ రావు, ఎగుడ.తి రుపతి, హనుమండ్ల. రమేష్, పాల్గొన్నారు.



## ట్రాక్టర్‌పై అసెంబ్లీకి వెళ్లిన
## ఆదిలాబాద్ ఎమ్మెల్యే
# పాయల్ శంకర్

**ఆదిలాబాద్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
గత బీఆర్ఎస్ ప్రభుత్వం తరహాలోనే ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని దగా చేస్తోందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే, బీజేపీ శాసనసభాపక్ష ఉప నేత పాయల్ శంకర్ అన్నారు. అసెంబ్లీ శీతాకాల సమావేశాలు సోమవారం నుండి ప్రారంభం కాగా, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అసెంబ్లి సమావేశాలకు ట్రాక్టర్ పై వెళ్లి వినూత్న నిరసన వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మరో ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలు పాల్వాయి హరీష్ బాబు, రామారావ్ పటేల్ తో కలసి స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ పాయల్ అసెంబ్లీ ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలోనూ రైతులకు అన్యాయం జరుగుతోందని, రైతాంగ సమస్యలపై ప్రధాన చర్చ జరగాలనే ఉద్దేశ్యంతో ట్రాక్టర్ ద్వారా అసెంబ్లీకి వచ్చినట్లు తెలిపారు. 2 లక్షల పంట రుణాలు మాఫీ కాకున్నా వంద శాతం పూర్తయినట్లు ప్రభుత్వం ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రైతుకు బ్యాంకులో ఎంత అప్పు ఉన్నా.. మీరు ఇస్తామన్న 2 లక్షలను మాఫీ చేయడంలో తిరకాసెందుకని ప్రశ్నించారు. మరోవైపు ఎకరానికి 15 వేల రైతుభరోసా ఇస్తామని దగా చేశారని, ఖరీఫ్ సాయాన్ని అటకెక్కించారని, యాసంగి పూర్తవుతున్న ఇప్పటివరకు రైతుభరోసా ఇవ్వడం లేదన్నారు. ఫసల్ భీమను అమలు చేసి, రైతుల పక్షాన ప్రీమియాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని ప్రకటించి ఏడాదవుతున్నా అమలు చేయలేదన్నారు.